సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం | 24 | జూన్ | 2025



చిరుత కాదు బెబ్బులి..
బోథ్ అడవుల్లో బెబ్బులి సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. వారం రోజులుగా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. 8లో▸



మలేషియా జైలు నుంచి స్వగ్రామానికి..
ఉపాధికోసం మలేషియా వెళ్లిన కడెం మండలంలోని లింగాపూర్‌కు చెందిన ముగ్గురు అక్కడి జైల్లో మగ్గారు. ఎట్టకేలకు వారు జైలు నుంచి తిరిగి స్వగ్రామానికి చేరారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

క్రీడల అభివృద్ధికి కృషి



క్రీడాజ్యోతితో ఎమ్మెల్యే శంకర్, ట్రెయినీ కలెక్టర్ సలోని తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ట్రెయినీ కలెక్టర్ సలోనితోకలిసి సోమవారం ప్రారంభించారు. క్రీడా జ్యోతి వెలిగించి అనంతరం క్రీడాకారులతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడారంగానికి ఖేలో ఇండియా ద్వారా మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఇందులో డీవైఎస్‌వో శ్రీనివాస్, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్రపాల్‌పాల్గొన్నారు.

'కాళేశ్వరం'పై సీబీఐ విచారణ చేపట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో పాటు బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఒకే స్టాండ్‌పై ఉన్నాయని పేర్కొన్నారు. విషయాన్ని వక్రీకరించి మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఇతర నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కాళేశ్వరంపై అవినీతి జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ప్రకటిస్తున్నా లోతైన విచారణ మాత్రం జరగడం లేదన్నారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

కైలాస్‌నగర్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్లతో వచ్చే నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి రమేశ్‌ను సోమవారం కలిసి సమ్మె నోటీసుఅందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం యూనియన్ నాయకులు కిరణ్, శంకర్ శ్రీనివాస్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

27న 5కే రన్

ఆదిలాబాద్‌టౌన్: మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో ఈనెల 27న 5కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ఉదయం 6 గంటలకు 5కే రన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఆసక్తి గలవారు https:// forms. gle/ UR2 iPE6 PYP9 AkdoA7 లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పరిషత్‌పై ఫోకస్

- మొదలైన 'స్థానిక' సందడి
- సన్నద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- శ్రేణులను అప్రమత్తం చేస్తున్న అధిష్టానాలు
- పావులు కదుపుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- అధికార కాంగ్రెస్‌కు జిల్లాలో సవాలే



స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు శ్రేణులను అప్రమత్తం చేస్తున్నాయి. ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ ముందు కు సాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఇప్పటికే 'పరిషత్' సందడి మొదలైంది. ఈ ఎన్నికలు అధికార పార్టీకి సవాలుగా మా రుతుండగా.. బీజేపీ, బీఆర్ఎస్ సైతం తమదైన శైలిలో పావులు కదుపుతున్నాయి.
– సాక్షి, ఆదిలాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. జిల్లాలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. పూర్తిస్థాయి నియోజకవర్గాలైన ఆదిలాబాద్‌లో బీజేపీ, బోథ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక జిల్లాలో పాక్షికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఖానాపూర్ పరంగా కాంగ్రెస్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యర్థుల నియోజకవర్గాల్లో స్థానిక పోరులో విజయం సాధించాలంటే ఆషామాషీ కాదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆయా నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలకు సంబంధించి క్యాడర్ బలంగా ఉండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా వచ్చే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌ను పరిశీలిస్తే ఇటీవల రైతు భరోసా విడుదల చేయడం, మరో పక్క ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, భూభారతి అమలు ద్వారా హస్తం పార్టీ ఎన్నికలకు సిద్ధమవుతుందనే సంకేతాలు ఇస్తుంది. బీఆర్ఎస్ విషయానికి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతే ఎన్నికలు చేపట్టాలని డిమాండ్ చేస్తూనే తాము ఎన్నికలకు మాత్రం సిద్ధమేనని పేర్కొంటుంది. కమలం పార్టీ సైతం ఎన్నికలకు సమాయత్తమవుతుంది. తలమడుగు మండలం సుంకిడిలో ఆదివారం బోథ్ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమావేశం అయ్యారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని శ్రేణులకు సూచించారు.

బలాబలాలు..
ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తమ ప్రభావం చూపాలని పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కదులుతున్నారు. పార్టీకి సంబంధించి ఈనెలలో గ్రామ, మండల, బ్లాక్ కమిటీలు నియమించనున్నారు. డీసీసీ అధ్యక్షుడిని కూడా ఇదే నెల చివరిలో నియమించేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ పరంగా పరిశీలిస్తే.. బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, క్యాడర్‌ను బలోపేతం చేస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆ పార్టీకి మాజీ మంత్రి జోగు రామన్న ఉండటం, జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండడంతో పాటు గతం నుంచి పార్టీని అంటిపెట్టుకొని ఉన్న ద్వితీయశ్రేణి గణాన్ని కోల్పోలేదు. ఈ నేపథ్యంలో ఈ మూడు నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్‌కే బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే పరిస్థితి ఉంది. ఇక బీజేపీ పరంగా పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో ఆ పార్టీకి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందాలని గట్టి ప్రయత్నంలో ఉన్నారు. బోథ్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న పతంగే బ్రహ్మానంద్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లో పార్టీ పోరు ఆసక్తికరంగా సాగే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కమలం పార్టీకి సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునిల్ బన్సాల్, రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు సమావేశం అయ్యారు. ఇందులో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చించినట్లు తెలిసింది.

గత ఫలితాలు ఇలా..
గత స్థానిక సంస్థల ఎన్నికలు 2019లో జరిగాయి. జిల్లాలో అప్పుడు 17 మండలాల పరిధిలో జెడ్పీటీసీ ఎన్నికల పరంగా బీజేపీ 5, కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 9 మండలాల్లో ప్రాతినిధ్యం వహించాయి. బీఆర్ఎస్‌కే జెడ్పీ పీఠం దక్కింది. ఐదేళ్ల ఆ పార్టీకి చెందిన రాథోడ్ జనార్దన్ చైర్మన్‌గా కొనసాగారు. ఇక ఎంపీటీసీ ఎన్నికల పరంగా 17 మండలాల్లో 158 స్థానాలకు గాను బీజేపీ 33, కాంగ్రెస్ 28, బీఆర్ఎస్ 83 స్థానాల్లో ప్రాతినిధ్యం వహించాయి. మెజార్టీ ఎంపీపీ స్థానాలు కూడా బీఆర్ఎస్‌కే దక్కాయి.

పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన

- 72 అర్జీలు స్వీకరించిన ఎస్పీ



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు ప్రజాఫిర్యాదుల విభాగానికి స్పందన లభిస్తుంది. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 72 మంది తరలివచ్చి ఎస్పీకి తమ సమస్యలను విన్నవించారు. వాటిని ఓపికగా విన్న ఎస్పీ సత్వరం పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో సీసీరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి కవిత, వామన్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి డ్యూటీ మీట్
నైపుణ్యాభివృద్ధికి డ్యూటీ మీట్‌లు దోహద పడతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాస్థాయి డ్యూటీ మీట్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపర్చేందుకు ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయిలో రివార్డులు అందించనున్నట్లు వివరించారు. ఇందులో డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, ఇన్‌స్పెక్టర్లు ప్రణయ్ కుమార్, మొగిలి, వెంకటేశ్వర్ రావు, వెంకటి, చంద్రశేఖర్, మురళి పాల్గొన్నారు.

అక్రమ అసెస్‌మెంట్‌లపై ఆర్డీ చర్యలు

- ఇద్దరు ఆర్ఐలపై సస్పెన్షన్ వేటు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌మున్సిపల్ పరిధిలో చోటు చేసుకున్న అక్రమ అసెస్‌మెంట్ల వ్యవహారంలో ఇద్దరు బల్దియా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఇందిరమ్మ కాలనీతో పాటు 170 సర్వే నంబర్‌లో అక్రమంగా పలు అసెస్‌మెంట్లు జరిగినట్లుగా కలెక్టర్ రాజర్షి షాకు లిఖిత పూర్వక ఫిర్యాదులు అందాయి. వీటిపై దృష్టి సారించిన కలెక్టర్ విచారణ చేపట్టాలని కమిషనర్ సీవీఎన్. రాజును ఆదేశించారు. విచారణ పూర్తిచేసిన కమిషనర్ అక్రమాలను నిర్ధారిస్తు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ మేరకు బాధ్యులపై చర్యలు చేపట్టాలని జిల్లా బాస్ నిర్ణయించారు. వరంగల్ ఆర్డీ షాహిద్ మసూద్‌కు కమిషనర్ నివేదిక పంపించారు. తదనుగుణంగా ఆర్ఐలు సుదర్శన్, వెంకటేశ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ ఆర్డీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇదే వ్యవహారంలో ఆర్వోపై ఇప్పటికే పోలీస్ కేసు నమోదు కావడంతో పాటు సరెండరైన విషయం తెలిసిందే. ఈ చర్యలు బల్దియా వర్గాల్లో గుబులు రేపుతున్నాయి. లోతుగా విచారణ చేపడితే మరి కొంతమంది పాత్ర వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్లు వినిపిస్తోంది.

జాతీయ శిక్షణకు ఎన్‌సీడీ అధికారి

ఆదిలాబాద్‌టౌన్: భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో కేరళలోని కొచ్చిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లా ఆహార భద్రత, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్‌పెల్లివార్ సోమవారం పాల్గొన్నారు. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, తమిళనాడు, లక్షద్వీప్, మేఘాలయ రాష్ట్రాల నుంచి ఆహార భద్రత అధికారులు హాజరవగా.. సాంకేతిక పరిజ్ఞానం అమలు నైపుణ్యాలు, నియంత్రణ సామర్థ్యాలు అంశంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 27 వరకు కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు.

అఖిల్.. మార్క్

- ప్రజలతో మమేకం అవుతూ.. అక్రమార్కులపై కొరడా ఝుళిపిస్తూ
- అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్‌బాస్ ఉక్కుపాదం
- జిల్లాలో వినూత్న కార్యక్రమాలకు ఎస్పీ శ్రీకారం
- మూడు నెలల్లో నేరాల అదుపునకు చర్యలు



మోడిఫైడ్ సైలెన్సర్లను రోడ్‌రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్ (ఫైల్)



విలేజ్ పోలీస్ కార్యక్రమంలో భాగంగా నార్నూర్‌లో గిరిజనులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో అక్రమార్కులపై పోలీస్ బాస్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు వారి గుండెల్లో గుబులు రేపుతోంది. నిరంతరం నిఘాతో రౌడీలు, బ్లాక్‌మెయిలర్లు, దళారులు, వడ్డీ వ్యాపారులు, భూకబ్జాదారులువణికిపోతున్నారు. వీడీసీలు, ఇసుకాసురుల ఆగడాలకు ఇప్పటికే చెక్ పడింది. దాబాల్లో మద్యం విక్రయాలు నిలిచిపోయాయి. వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు కనిపించకుండా పోయాయి. ఆన్‌లైన్ బెట్టింగ్, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టేవారిపై నిఘా పెంచడంతో అవి తగ్గుముఖం పట్టాయి. రోడ్లపై ఫ్లెక్సీలు, బ్యానర్లు కనిపించకుండా పోయాయి. బెల్టుషాపులను స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. షీటీమ్ ద్వారా పోకిరీలకు అడ్డుకట్ట వేస్తున్నారు. మట్కా, గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో కేసులు తగ్గుముఖం పట్టాయి. పోలీసుల ప్రవర్తనపైనా ఫోకస్ పెట్టారు. విధులు విస్మరించిన పలువురిపై సస్పెన్షన్ వేటు కూడావేశారు. ఎస్పీ విధుల్లోచేరిన మూడు నెలల్లోనే నేరాల అదుపునకు చర్యలు చేపట్టారు.

ఎస్పీ ప్రత్యేక చొరవ ఇలా..

- జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీచౌక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు.
- ప్రతీ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి బాధితుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు.
- భూకబ్జాదారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేశారు.
- ఇప్పటివరకు 20 మంది భూకబ్జాదారులను అరెస్టు చేశారు. డాక్యుమెంట్ రైటర్లతో పాటు సహకరించిన అధికారులపై సైతం కేసులు పెట్టారు.

ఎస్పీ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు..

- మెస్సేజ్ యువర్ ఎస్పీ
- ఆపరేషన్ చబుత్రా
- పోలీసులు మీకోసం
- హోమ్‌గార్డు సిబ్బందికి ఆరోగ్య భద్రత
- పిల్లలకు సమ్మర్ క్యాంప్
- యాంటీ డ్రగ్ కమిటీ
- అభయ- మై టాక్సీ ఈస్ సేఫ్

- ఆపరేషన్ చబుత్రాలో భాగంగా రాత్రి 11 గంటలు దాటిందంటే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న వారిని స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే రౌడీమేళా నిర్వహించి వార్నింగ్ ఇచ్చారు. డీజే చప్పుళ్లు, మైక్‌ల హోరు తగ్గింది. రోడ్లపై, జంక్షన్లలో బర్త్‌డే కేక్ కటింగ్‌లు, ఫ్లెక్సీలు కనిపించకుండా పోయాయి.
- జిల్లా కేంద్రంలోని ముఖ్య కూడళ్లలో పోలీస్ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. బ్యాంకుల వద్ద పోలీసుల నిఘా పెంచారు.
- అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు, వేసవిలో క్రీడా శిబిరాలను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికుల భద్రతే పరమావధిగా అభయ-మై టాక్సీ ఈస్ సేఫ్ కార్యక్రమానికి తాజాగా శ్రీకారం చుట్టారు.
- ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే దృష్టికి తీసుకువచ్చేలా మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని చేపట్టారు. నేరుగా ఎస్పీకి వాట్సాప్ నంబర్ 8712659973 ద్వారా తెలియజేసేందుకు వీలు కల్పించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు.

పటిష్టంగా కమ్యూనిటీ పోలీసింగ్
జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపుతున్నాం. కమ్యూనిటీ పోలీసింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నాం. గంజాయి, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అడ్డుకట్ట వేస్తున్నాం. అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నాం. బ్యాంకుల వద్ద దళారీలపై ఇటీవల కేసులు నమోదు చేశాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదుతో పాటు శిక్ష పడేలా చూస్తున్నాం. మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి మంచి స్పందన ఉంది.
– అఖిల్ మహాజన్, ఎస్పీ

సమస్యల నివేదన

- 'ప్రజావాణి'కి వినతుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వారు ఉన్నతాధికారులకు తమ సమస్యలను నివేదించారు. కలెక్టర్ రాజర్షి షా వారి నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వారం వివిధ శాఖలకు సంబంధించి 115 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే...



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

ఉపాధ్యాయులను నియమించాలి




మా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు లేరనే కారణంతో ఉపాధ్యాయులను నియమించలేదు. పాఠశాలను సైతం అంగన్‌వాడీ కేంద్రంగా మార్చారు. ప్రస్తుతం ఊరిలో బడీడు పిల్లలు 30 మంది వరకు ఉన్నారు. గ్రామంలో బడి లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలో గల వడ్‌గాం పాఠశాలకు వెళుతున్నారు. గతేడాది ఓ విద్యార్థిని బడికి వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. ఈ మేరకు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
– దబ్బాకూచి గ్రామస్తులు, భీంపూర్

ప్రొసీడింగ్‌లిచ్చారు.. ముగ్గు పోయట్లేదు




అయ్యా.. మేము కూలీనాలి చేసుకునే నిరుపేదలం. సొంతింటి స్థలం ఉండడంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. సర్వే చేసిన కార్యదర్శి మేము అర్హులమని నిర్ధారించారు. మాకు ప్రొసీడింగ్ లెటర్లు కూడా ఇచ్చారు. ముగ్గు పోయాలని కార్యదర్శిని కోరగా మాకు స్థలం లేదంటూ నిరాకరిస్తున్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలని విన్నవించుకుంటున్నాం.
– రాగి లలిత, గొడ్డెల అరవినా, సాయిలింగి, తలమడుగు

విచారణ జరిపి న్యాయం చేయండి..



సార్.. మేమంతా ఆదిలాబాద్‌లోని బెల్లూరి శివారు సర్వేనంబర్ 47/1/2, 47/1/3లో మదస్తు రమేశ్, మదస్తు ఆనంద్ రావు, మదస్తు సత్యనారాయణల నుంచి ప్లాట్లను న్యాయబద్ధంగా కొనుగోలు చేశాం. వాటిలో ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నాం. అయితే ఇటీవల రైల్వే అధికారులు ఆ స్థలమంతా తమదంటూ ఇటీవల మార్కింగ్ చేశారు. విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతున్నాం.
– బాధితులు, ఆదిలాబాద్

ఆ ఏజెన్సీని బ్లాక్‌లిస్టులో పెట్టాలి



రిమ్స్‌లో 800 పోస్టులు దక్కించుకున్న మహాలక్ష్మి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్మికులకు రెండేళ్లుగా పీఎఫ్, జీఎస్‌టీ, ఈఎస్ఐ చెల్లించట్లేదు. సంబంధించిన వివరాలివ్వాలని జిల్లా ఉపాధి కల్పనాధికారికి స.హ. చట్టం కింద దరఖాస్తు చేశాను. రెండేళ్లుగా తిరుగుతున్నా సమాచారం ఇవ్వకుండా దాట వేస్తున్నారు. సంబంధిత ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు సదరు అధికారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.
– నోముల రాజేందర్‌గౌడ్, మందమర్రి, మంచిర్యాల జిల్లా

కలెక్టర్‌కు సన్మానం..

సాత్నాల మండలం తోయగూడకు చెందిన జాదవ్ ఉపేందర్ తన మూడెకరాల భూమి కబ్జాకు గురైందని, దాన్ని ఇప్పించాలని కోరుతూ ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు విచారణ జరిపించిన కలెక్టర్ భూ కబ్జా జరిగినట్లుగా నిర్ధారించి ఇటీవల నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో బాధితుడికి తిరిగి ఆ భూమిని ఇప్పించారు. దీంతో సదరు యువకుడు సోమవారం కలెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మరో దివ్యాంగుడికి యుడీఐడీ సర్టిఫికెట్‌తో పాటు సదరం సర్టిఫికేట్‌ను ప్రజావాణిలో అందించారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి



అయ్యా.. నేను పెంకుటిళ్లలో ఒంటరిగా జీవిస్తున్నా. 2018లో జరిగిన అగ్నిప్రమాదంలో నా ఇల్లు పూర్తి గా కాలిపోయింది. తాత్కాలికంగా రేకులు వేసుకుని ఉంటున్నా. దయచేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నా
–సిరాం గంగమ్మ, తంతోలి, ఆదిలాబాద్ రూరల్

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ రాజర్షి షా సోమవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చిన ఈవీఎంల స్థితిగతులను పరిశీలించారు. భద్రత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా తదితరులున్నారు.

'నషా ముక్త్ భారత్' జయప్రదం చేయాలి

కైలాస్‌నగర్: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఈనెల 26 వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా కోరారు. మిషన్ పరివర్తన నిషాముక్త్ భారత్ అభియాన్ జిల్లాస్థాయి సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం పురస్కరించుకుని వారం పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి అధికారులు, ఉద్యోగులతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా సంక్షేమాధికారి మిల్కా పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి
ఈ నెల 16 నుంచి జులై 31 వరకు నిర్వహించనున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. స్టాప్ డయేరియా జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. డయేరియా కట్టడికి చేపట్టాల్సి న చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఇందులో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీపీవో రమేశ్, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు పాల్గొన్నారు.

'ఎన్‌జీసీ' పోస్టర్ ఆవిష్కరణ
నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. HARITH & THE WAY OF LIFE థీమ్‌పై దేశవ్యాప్తంగా కేంద్ర పర్యావరణ, మంత్రిత్వ శాఖ క్విజ్‌పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఈమేరకు జూలై 1 నుంచి ఆగస్టు 21వరకు http://ecomitram. app/ nspc పోర్టల్‌లో ఒకటి నుంచి పీహెచ్‌డీ వరకు చదివే విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మొక్క నాటుతున్న, నీటిని సంరక్షిస్తున్న, వ్యర్థాలను వేరుచేస్తున్న సెల్ఫీ అప్‌లోడ్ చేయాలని సూచించారు.

నేడు రైతులతో సీఎం ముఖాముఖి
కైలాస్‌నగర్: వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో విజ యవంతంగా జమ చేసిన నేపథ్యంలో ఈనెల 24న సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం దీనిపై సంబంధిత శా ఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఆదుకోండి.. 'ఆసరా'నివ్వండి

ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన ఓసావార్ రాజేశ్‌తో పాటు తన ఇద్దరు పిల్లలూ మరుగుజ్జులే. కుమారుడు శ్రవణ్ పదో తరగతి, కూతురు చైత్ర ఆరో తరగతి చదువుతున్నారు. చైత్ర కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అరగంట పాటు నిల్చొనే పరిస్థితి లేదు. పింఛన్ కోసం పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నాడు రాజేశ్. దాతలు ముందుకు వచ్చి చేయూత అందించాలని కోరుతున్నాడు.
– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



బిడ్డ, కొడుకుతో రాజేశ్

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ సోమవారం తీర్పు నిచ్చినట్లు కోర్టు డ్యూటీ ఆఫీసర్ డల్లు సింగ్ తెలిపారు. నేరడిగొండ మండలం బంధం గ్రామానికి చెందిన పన్నాల రాజు జిల్లా కేంద్రానికి చెందిన రాజారాంపై కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టినట్లు హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. ఉట్నూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల వైపు వెళ్తుండగా వేంపల్లి మేకల మండి సమీపంలో మేకల మంద అడ్డు రావడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశాడు. అదే సమయంలో వెనకనుంచి వస్తున్న టిప్పర్ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు వెనకభాగం పూర్తిగా ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ చొప్పదండి మొగిళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ గౌరమ్మ భట్టి వద్దగల షేక్ వసీమ్ ఇంట్లో ఆదివారం రాత్రి షేక్ తౌఫిక్, సయ్యద్ ఫైసల్, షేక్ వసీమ్, అఫ్రోజ్, జాహెద్, నాజిమ్ పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తప్పించుకున్న ఖైదీ అరెస్ట్

మంచిర్యాలక్రైం: ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఖైదీని కోర్టులో హాజరు పరిచేందుకు సోమవారం తీసుకురావడంతో పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన ఘటన కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీకి చెందిన తీగల భాగ్యలక్ష్మి (45)ని మిట్టపల్లి వీరస్వామి 2024 డిసెంబర్ 8న బండరాయితో మోది హత్య చేశాడు. మంచిర్యాల పోలీసులు అరెస్ట్ చేసి ఆదిలాబాద్‌కు రిమాండ్‌కు తరలించారు. విచారణ నిమిత్తం మంచిర్యాల కోర్టుకు తీసుకురాగా నీళ్లుతాగుతానని వెళ్లి పారిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు గంట వ్యవధిలోనే పట్టుకున్నారు. స్థానిక సీఐని వివరణ కోరగా తప్పించుకున్నది వాస్తవమేనని, వెంటనే పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

బెల్లంపల్లి: కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపిన వివరాల మేరకు కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన షేక్ మహ్మద్ (40) పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మహ్మద్‌కు అతని భార్య షహీనాకు మధ్య ఇటీవల మనస్పర్థాలు రావడంతో కూతుర్ని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో కలత చెందిన మహ్మద్ హన్మాన్‌బస్తీలోని అత్తారింటికి వెళ్లి పెరట్లో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఎస్సై రాకేష్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- బైక్‌పై వచ్చిన ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగలు
- గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎం బాక్స్‌ను కట్ చేసిన దుండగులు
- ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం తెల్లవారుజామున అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు చోరీకి యత్నించిన ఘటన కలకలం రేపింది. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపిన వివరాల మేరకు కాల్‌టెక్స్ ఏరియాలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో బజాజ్ షోరూం పక్కన ఉన్న ఏటీఎం వద్దకు తెల్లవారు జామున సుమారు 3:15 గంటల ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చారు. వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం బాక్స్ దిగువన కొంతమేర కట్ చేశారు. అదే సమయంలో రైల్వేస్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన బ్లూకోర్ట్ పోలీసులు టూటౌన్ వైపు వస్తుండగా ఏటీఎం షట్టర్ మూసి ఉండటంతో అనుమానం వచ్చి ఆగారు. ఏటీఎం పక్కన రెండు బైక్‌లు పార్కింగ్ చేసి ఉండడం గమనించి వాటి సైలెన్సర్లను చేతితో టచ్ చేయడంతో వేడి సెగ తగిలింది. వెంటనే టూటౌన్ ఎస్సై మహేందర్‌కు సమాచారం అందించారు. అప్పటికే శాంతిఖని బస్తీవైపు పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై స్టేషన్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్‌ను వెంట తీసుకుని వెళ్లమని ఆదేశించారు. ఆ ప్రకారంగానే ఏటీఎం వద్దకు వెళ్లడంతో పోలీసులను గమనించిన దొంగ పక్కనున్న గోడదూకి పారిపోయేందుకు యత్నించాడు. అడ్డుకున్న పోలీసులపై వెంట తెచ్చుకున్న కారం పొడిని చల్లాడు. అయినా పోలీసులు దొంగను చాకచక్యంగా పట్టుకున్నారు. మిగిలిన దొంగలు అప్పటికే పలాయనం చిత్తగించారు. కాగా కరీంనగర్ నుంచి ఏటీఎం సిబ్బంది వచ్చి పరిశీలించారు. ఖాళీ బాక్స్ మాత్రమే అపహరణకు గురైనట్లు గుర్తించారు. నగదు చోరీ కాలేదన్నారు.


గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన ఏటీఎం

హర్యానా ముఠా పనేనా?

ఏటీఎంలో చోరీకి యత్నించింది హర్యానాకు చెందిన దొంగల ముఠా సభ్యులేనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న దొంగ తనది హర్యానా అని చెప్పడంతో నిందితులంతా ఆప్రాంతానికి చెందిన వారై ఉంటారని భావిస్తున్నారు. పారిపోయిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు తీవ్రతరం చేసినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలంలో గ్యాస్ కట్టర్, గ్యాస్ సిలిండర్, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, పలువురు ఎస్సైలు ఘటనాస్థలిని సందర్శించారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తులను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని టీకంగర్ జిల్లాకు చెందిన సౌరభ్ రాయక్వార్, రితికోసేన్ వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వర్క్‌ఫ్రం హోం అంటూ రోజుకు రూ.2 వేల నుంచి రూ.8 వేల వరకు సంపాదించవచ్చని అమాయకులను బురిడీ కొట్టిస్తున్నట్లు తెలిపారు. హాయ్ నాపేరు టీనా.. అంటూ వాట్సాప్‌లో పరిచయం.. టెలిగ్రామ్‌లో టాస్కులు పంపుతూ అధిక డబ్బు ఆశ చూపుతూ ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని జందాపూర్‌కు చెందిన చెన్న శివకుమార్ నుంచి రూ.5 లక్షల 3వేల వరకు వసూలు చేశారన్నారు. ఈనెల 14న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగతా ముఠా సభ్యులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదరు నిందితులు 25 వాట్సాప్ గ్రూప్‌లను నడుపుతున్నారని, ఇందులో 250 మంది సభ్యులు ఉన్నారన్నారు. నెలకు రూ.30 లక్షల వరకు ట్రాన్సెక్షన్ చేశారన్నారు. దాదాపు 900 మంది మోసం చేసినట్లు గుర్తించామన్నారు. వీరికి సంబంధించిన సైబర్ మోసగాళ్లు విదేశాల్లో ఉంటూ ఏజెంట్ల ద్వారా అమాయకులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలియని వెబ్‌సైట్లు, లింక్‌లను ఓపెన్ చేయవద్దని ఎస్పీ సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

చిరుత కాదు బెబ్బులి..

- రఘునాథ్‌పూర్ అడవుల్లో సంచారం
- ట్రాప్ కెమెరాకు చిక్కిన పులి
- సమీప గ్రామాల్లో హైఅలర్ట్

బోథ్: బోథ్ అడవుల్లో బెబ్బులి సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. వారం రోజులుగా బోథ్ మండలంలోని కంటెగాం, నిగిని, మర్లపెల్లి, నారాయణపూర్, రఘునాథ్‌పూర్ గ్రామాల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది. వారం క్రితమే కంటెగాం చెరువు సమీపంలో ఓ ఆవును, ఈ నెల 19న రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలో ఓ లేగదూడను హతమార్చింది. అయితే తొలుత చిరుతగా భావించిన అధికారులు అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ట్రాప్ కెమెరాలో పెద్దపులి కనిపించడంతో అప్రమత్తమయ్యారు.

తిప్పేశ్వర్ నుంచి రాక..

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి పెద్దపులులు తరచూ వచ్చి వెళ్తున్నాయి. తాజాగా తిప్పేశ్వర్ నుంచే బోథ్ అటవీ ప్రాంతానికి పులి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో చింతల్‌బోరి, వజ్జర్, గొల్లాపూర్, చింతగూడ, నేరుడుపల్లె నుంచి నిగిని మీదుగా సారంగాపూర్, అడెల్లి ప్రాంతాల్లో పులి సంచరించి కవ్వాల్ అటవీ ప్రాంతానికి వెళ్లింది. ప్రస్తుతం కూడా అడెల్లి నుంచి కవ్వాల్ వైపు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అడెల్లి దారిలో అలర్ట్

పులి సంచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ధన్నూర్, రఘునాథ్‌పూర్ మీదుగా అడెల్లి, సారంగాపూర్ వెళ్లేవారు అలర్ట్‌గా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రఘునాథ్‌పూర్ వద్దగల గుట్ట వెనక నుంచి నారాయణపూర్, అడెల్లి, మర్లపెల్లి, నిగిని, కంటెగాం అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు సోమవారం రఘునాథ్‌పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులను అలర్ట్ చేశారు. గ్రామస్తులెవరూ అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. చిన్నారులు, వృద్ధులు అటవీ ప్రాంతంలోని చేలలోకి వెళ్లవద్దన్నారు. కాగా బోథ్ అడవుల్లో పులి సంచారం ఏడాదిలో ఇది రెండవసారి. గతేడాది అక్టోబర్‌లో సంచరించిన పులి మళ్లీ జూన్‌లో బోథ్ మండలానికి వచ్చింది.


ఇటీవల పులి హతమార్చిన లేగదూడ కళేబరం

మలేషియా జైలు నుంచి స్వగ్రామానికి..

- కేటీఆర్, జాన్సన్‌నాయక్ చొరవతో ఇంటికి చేరిన ముగ్గురు బాధితులు

కడెం: ఉన్న ఊళ్లో ఉపాధి లేక.. కుటుంబ పోషణకోసం పొట్టచేత పట్టుకుని కుటుంబ సభ్యులను వదిలి ఉపాధికోసం దేశం కాని దేశం వెళ్లి నరకయాతన అనుభవించారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కడెం మండల వాసులు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గుండారపు శ్రీనివాస్ 2023 జనవరిలో, అదే గ్రామానికి చెందిన రాచకొండ నరేశ్ మార్చిలో, మున్యాల్‌కు చెందిన యమునూరి రవీందర్ జూన్‌లో ఉపాధి నిమిత్తం మలేషియా దేశానికి వెళ్లి 17 నెలల క్రితం జైలు పాలయ్యారు.

జైల్లో నరకయాతన..

మలేషియాలో ఉపాధి కల్పిస్తానని ఓ ఏజెంట్ ఈ ముగ్గురికి ఆశ చూపాడు. రూ.60 వేలు కడితే అక్కడ రూ.30 వేల జీతం వస్తుందని చెప్పడంతో విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. అక్కడ అల్యూమినియం కంపనీలో లేబర్ పనులు చూపించాడు. కొద్ది నెలలు బాగానే ఉన్నా ఆతర్వాత పనుల్లేక పస్తులున్నారు. ఉపాధికోసం తిరుగుతున్న క్రమంలో అక్కడి పోలీసులకు చిక్కడంతో అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. విజిట్ వీసాపై వెళ్లినవారు అక్కడి నిబంధనల ప్రకారం పర్మినెంట్ చేసుకోవాలంటే రూ.2 లక్షలు కట్టాల్సి ఉంటుంది. చేసేదేంలేక రూ.2 లక్షలు కట్టి పర్మినెంట్ చేసుకుందామని అనుకున్నారు. కానీ అక్కడి ప్రభుత్వం నిబంధనలు సవరించడంతో 2023 తర్వాత వచ్చిన వారికి పర్మినెంట్ అయ్యే అవకాశం చేజారింది. దీంతో ముగ్గురు 7 నెలల 17 రోజుల పాటు జైల్లో మగ్గారు.

కేటీఆర్, జాన్సన్‌నాయక్ చొరవతో..

తమవారు జైలులో బందీలుగా ఉన్నారని, ఎలాగైనా వారిని ఇంటికి రప్పించాలని బాధిత కుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్‌ను వేడుకున్నారు. స్పందించిన ఆయన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సలహా మేరకు మూడుసార్లు మలేషియా వెళ్లి అక్కడి జైలు అధికారులతో మాట్లాడారు. ఇద్దరు న్యాయవాదులను ఏర్పాటు చేసి సదరు వ్యక్తులను జైలునుంచి విడిపించారు. బయటకు వచ్చిన వారికి తమ సొంత ఖర్చులతో విమాన టికెట్ ఇప్పించడంతో ఈనెల 10న స్వగ్రామానికి చేరుకున్నారు. ఇంటికి తిరిగి వస్తామని కలలో కూడ అనుకోని వారు కేటీఆర్, జాన్సన్‌నాయక్ చొరవతో ఇంటికి చేరుకున్నారు. తమ వారిని ఇంటికి చేర్పించిన జాన్సన్‌నాయక్‌ను సోమవారం బాధిత కుటుంబ సభ్యులు ఖానాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్


ఇంటికి వస్తామనుకోలే



జైలు నుంచి మమ్మల్ని విడిపించి ఇంటికి రప్పించిన కేటీఆర్, జాన్సన్‌నాయక్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. జైల్లో ఉన్న మేము ఇంటికి వస్తామని కలలో కూడా అనుకోలేదు. జాన్సన్ అన్న మూడుసార్లు వచ్చారు. విడిపిస్తానని భరోసానిచ్చారు.

– రాచకొండ నరేశ్, లింగాపూర్

నరకయాతన అనుభవించాం



విజిట్ వీసా మీద మలేషియాకు వెళ్లిన మమ్మల్ని అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలులో వేశారు. ఏడు నెలల 17 రోజులపాటు జైలులో నరకయాతన అనుభవించాం. జైలులో కడుపునిండా తిండి పెట్టకపోవడంతో అనారోగ్యానికి గురయ్యాం.

– యమునూరి రవీందర్, మున్యాల్

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

ఆదిలాబాద్‌టౌన్: తప్పిపోయిన బాలుడిని బాలల సంరక్షణ అధికారులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఎనిమిదేళ్ల బాలుడు ఈనెల 13న ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఏడుస్తూ కనిపించడంతో రైల్వే సిబ్బంది బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. బాలుడు ఆకోల అని చెప్పడంతో మహారాష్ట్ర ప్రాంతంలో గాలించారు. సోషల్ మీడియా, దినపత్రికల్లో బాలుడు అదృశ్యమైనట్లు వార్తలు ప్రచురితం అయ్యాయి. ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన దంపతులు రవి, తమ కుమారుడని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సోమవారం బాలుడిని ఐసీపీఎస్ అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, సభ్యులు దశరథ్, డేవిడ్, బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వినోద్, పద్మ, అశ్విని పాల్గొన్నారు.



బాలుడిని అప్పగిస్తున్న అధికారులు

బొలెరో ఢీకొని ఒకరు మృతి

బెల్లంపల్లి: పట్టణంలోని గాంధీనగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల వెంకటేష్ (32) ఆదివారం రాత్రి నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటుతుండగా బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో ఢీకొని మహిళ..

జన్నారం: బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరిన మహిళను ఆటో రూపంలో మృత్యువు కబళించింది. ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లింగపూర్‌కు చెందిన ఉప్పల్‌వార్ వనిత (హేమలత) (35) మూడు రోజుల క్రితం తన తల్లి కస్తూలపూరి గంగాలక్ష్మి ఇంటికి వచ్చింది. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కలమడుగులోని బంధువుల ఇంటికి వెళ్లింది. కలమడుగు నుంచి రేండ్లగూడ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో అతివేగంగా ఢీకొట్టింది. వనితకు తీవ్ర గాయాలుకాగా తల్లి గంగాలక్ష్మీకి కాలు, విరిగింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ వనిత రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు ఘటనకు కారణమైన ఆటోడ్రైవర్ హన్మండ్ల సత్తన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



వనిత (ఫైల్)

మొబైల్ షాపులో చోరీ

సాత్నాల: బోరజ్ మండలం కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు శ్యామ్ ఆన్‌లైన్ మొబైల్ షాపు షటర్ పగులగొట్టి రూ.30వేలు అపహరించినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. సోమవారం ఉదయం శ్యామ్ తన దుకాణానికి వెళ్లగా షట్టర్ పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి గాయాలు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొట్టిన ఘటనలో ఎరుకల వెంకటేశ్వర్లు అనే సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమగూడెంకు చెందిన వెంకటేశ్వర్లు స్కూటీపై బెల్లంపల్లి వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కుడికాలు తెగిపోయింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈవిషయమై కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదన్నారు.


గాయపడిన వెంకటేశ్వర్లు

పాఠశాల బస్సు డ్రైవర్‌కు జైలు

తాండూర్: సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్, ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో అచ్చలాపూర్ నుంచి రేపల్లెవాడ వైపు వెళ్తున్న సెయింట్ థెరిస్సా పాఠశాల బస్సును ఆపి డ్రైవర్ తోట సత్యనారాయణకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి బెల్లంపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

మంత్రి జూపల్లిని కలిసిన నేతలు


మంత్రితో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు

కైలాస్‌నగర్/తలమడుగు: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావును ఉమ్మడి జిల్లాకు చెందని కాంగ్రెస్ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బోథ్ మాజీ ఎమ్మెల్యే బాపురావు, విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న యాదవ్, శ్యామ్ నాయక్ హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలిశారు.

26, 27 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన

బాసర: ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలలో స్పోర్ట్స్, ఎన్‌సీసీ, క్యాప్, పీహెచ్‌సీ కోటాల కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. 26న క్యాప్, పీహెచ్‌సీ, 27న స్పోర్ట్స్, ఎన్‌సీసీ, విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు బాసర క్యాంపస్ ఆవరణలో హాజరు కావాలని ఆయన సూచించారు. పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల తుది ఎంపిక జాబితా విడుదల చేయబడుతుందని వెల్లడించారు. జనరల్ కోటా అభ్యర్థుల తుది ఎంపిక జాబితా జూలై 4న విడుదల చేసి 7న మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ డాక్టర్ దేవరాజు, బండి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి: మండలంలోని నంబాల సమీపంలో ట్రాలీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. గ్రామానికి చెందిన మధుకర్‌పై కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న సుమారు 7 క్వింటాళ్ల 70 కిలోల బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్ఐ మురళీకృష్ణకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తిర్యాణి మండలం ఎర్రబండకు చెందిన గ్రామస్తులు పాఠశాల మంజూరు చేయాలని, గాదిగూడ మండలం చిత్తగూడ గ్రామస్తులు అంగన్‌వాడీ టీచర్‌ను నియమించాలని, తదితర సమస్యలపై 215 దరఖాస్తులు సమర్పించారు. ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, డీడీ అంబాజీరావు, పీహెచ్‌వో సందీప్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఆదివాసీలకు హక్కుపత్రాలు ఇవ్వాలి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతాత్ రాందాస్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీవో ఖుష్బూ గుప్తాకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్ము, ఎల్లయ్య, నర్సయ్య, చంద్రయ్య, శంకర్, సంధ్య, నంబాజీ, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

'షెటర్లు రద్దుచేయాలి'

బెల్లంపల్లి: అనర్హులకు కేటాయించిన సమీకృత కూరగాయల మార్కెట్ షెటర్లను రద్దు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు ధారకళ్యాణి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కె.అరవింద్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, తాండూర్ మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, యుగంధర్, సుమలత, సంతోష్ అగర్వాల్, లావణ్య, గౌస్‌బాబా, కళావతి, రాజేశ్వరి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలకు అస్వస్థత

తాంసి: మండలంలోని అట్నంగూడకు చెందిన ముగ్గురు మహిళలు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన జ్యోత్స్న, లక్ష్మి, అనసూయ వాంతులు, విరోచనాలు చేసుకోవడంతో అంబులెన్సులో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

ఎడ్లబండిని ఢీకొన్న ట్రాక్టర్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లిలో ఎడ్ల బండిని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో రైతుతోపాటు ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన టాకిరే కాశీనాథ్ ఎడ్లబండిపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు ఈసగాం ఏఎస్సై హీరామన్ గ్రామస్తులతో చర్చలు జరిపారు.

పలువురిపై కేసు నమోదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. జాడి నారాయణ, వేల్పుల మొగిలి, పొన్నాల జనార్దన్, మెండె కిష్టయ్య, ఇందూరి రమేశ్, లింగంపల్లి అంకులు, లింగంపల్లి సంతోష్, రేచవేని రాజేశ్, లింగంపల్లి రాజం, లింగంపల్లి బాపు, లింగంపల్లి తిరుపతి, కంబాల రాజలింగు, కంబాల మల్లేశ్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.